ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం అక్టోబరు 2, 2024



విద్యా కేంద్రంగా... గాంధీనగర్!

సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు కసరత్తు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల భవనాలు ఒకేచోట ఉండేలా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణాలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అన్ని సౌకర్యాలతో అత్యుత్తమ ప్రమాణాలతో గురుకులాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో వీటి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గణపురం మండలం గాంధీనగర్ మైలారం గుట్ట వద్ద ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి

రూ.160 కోట్లతో ప్రతిపాదనలు

స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమీకృత గురుకుల పాఠశాల సముదాయం నిర్మాణానికి నిధులు సమకూర్చాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ నేపథ్యంలో అధికారులు ఏయే గురుకులాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.. వాటి పరిస్థితిపై నివేదికలు తయారు చేశారు. సమీకృత గురుకుల పాఠశాల సముదాయం నిర్మాణానికి రూ.160 కోట్లతో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్లు ప్రతిపాదనలు రూపొందించారు. గణపురం మండలం గాంధీనగర్‌లో 30 ఎకరాలకు పైగా స్థలం ఉందని, అవసరమైన బడ్జెట్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు.

తప్పనున్న అద్దెల భారం

జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు ఏడు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో రెండు హనుమకొండ జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఆయా భవనాల అద్దె నెలకు దాదాపు రూ.15 లక్షలకు పైగా చెల్లిస్తున్నారు. సమీకృత గురుకుల పాఠశాలల సముదాయంతో అద్దెలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి.

☛ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాలు, జ్యోతిబా పులే బాలుర, బాలికల గురుకులాలు, అర్బన్ రెసిడెన్షియల్, మైనార్టీ గురుకులం మొత్తం ఏడు పాఠశాలలు ఒకేచోట నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

☛ ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉండటంతో గాంధీనగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే అక్కడ డైట్ కళాశాల నిర్మాణం పూర్తయింది. అందులో జ్యోతిబా పులే బాలికల గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. దీంతో పాటు మరిన్ని కళాశాలలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

సకల సౌకర్యాలతో..

సమీకృత గురుకుల పాఠశాలల్లో సకల సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నమూనా, అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కనీసం 25 ఎకరాల స్థలంలో నిర్మించేందుకు నిర్ణయించారు. తరగతి గదులు, డైనింగ్ హాళ్లు, వసతిగృహాలు, క్రీడా ప్రాంగణం, తదితర ఏర్పాట్లు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్మాణాలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నారు.


గాంధీనగర్‌లో ప్రభుత్వ స్థలం

ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం

- రాజేందర్, డీఈఓ, జయశంకర్ భూపాలపల్లి

సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణాలకు గణపురం మండలం గాంధీనగర్‌లో స్థలం అందుబాటులో ఉంది. నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. అన్ని గురుకులాలు ఒకేచోట నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకేచోట గురుకులాలు ఉండటంతో పర్యవేక్షణ సులభమవుతుంది.

వానాకాలంలో.. దంచికొడుతున్న ఎండలు!

35 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు

జిల్లాలో మండలాల వారీగా మంగళవారం నమోదైన ఉష్ణోగ్రత (గరిష్ఠ) వివరాలు

మహదేవ్‌పూర్	38.4
మొగుళ్లపల్లి	36.1
మహాముత్తారం	38.4
మల్హర్‌రావు	37.4
కొత్తపల్లి గోరి	39.9
టేకుమట్ల	35.7
పలిమెల	37.4
గణపురం	37.0
కాటారం	39.5
చిట్యాల	38.1
రేగొండ	38.2
భూపాలపల్లి	39.6

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

కొన్ని రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. తాజాగా ఎండలు దంచికొండుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానాకాలంలో ఈ ఎండలేంటని ఆశ్చర్యపోతున్నారు. వేసవి మళ్లీ వచ్చిందా..? అనే తీరులో గత మూడు రోజులుగా ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఐదు నిమిషాలు కరెంటుపోతే ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంటోంది.. కొన్ని ఇళ్లలో పక్కన పడేసిన కూలర్లను మళ్లీ తీసుకువచ్చి చల్లగాలితో ఉపశమనం పొందుతున్నారంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్టోబరులో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు చలి కూడా ప్రారంభం అవుతుంది. కానీ, అందుకు భిన్నంగా జిల్లా వ్యాప్తంగా ఉదయం 7 గంటల నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



గణపురంలో మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా..

జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో మంగళవారం 35 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరీ ముఖ్యంగా రేగొండ, కాటారం, మహదేవ్‌పూర్ మండలాల్లో 38 డిగ్రీల నుంచి 39 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరడంతో పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎండ తీవ్రతకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్న సమయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మహాత్ముడి మాట.. పూలబాట!

● పల్లెలు మురవాలి.. గాంధీజీ ఆశయం నెరవేరాలి ఉయ్యాలో..

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే




గ్రామాల అభివృద్ధి కోసం మహాత్ముడు కలలు కన్నారు.. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని తపించారు. గొప్ప వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచిన ఆయన బోధనలు బతుకమ్మ పండగలోనూ కనిపిస్తాయి.. బతుకమ్మ అంటే జీవిత పండగ అని అర్థం. నిత్యం పంటలతో సుభిక్షంగా ఉంటూ వేడుకలా సాగాలని పార్వతీదేవిని మహిళలు వేడుకుంటారు. గాంధీ కోరుకున్నదీ పల్లెలు పచ్చగా ఉండాలనే. అందుకే బతుకమ్మ పండగలో గాంధీ ఆశయాలు కనిపిస్తాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి.. మరో వైపు వైభవంగా జరిగే బతుకమ్మ పండగ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మహాత్ముడి ఆశయ సాధనలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి పల్లెల గురించి కథనం..

ఆరుగుంటుపల్లి.. పారిశుద్ధ్యంలో ఆదర్శం

ఇంకుడుగుంతల నిర్మాణంలో ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఆరుగుంటుపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 125 మంది జనాభా ఉండగా, 38 నివాసాలున్నాయి. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో.. గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో కూడా నీటి సమస్య రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో భవాని గ్రామస్థులకు సహకరించడంతో పరిశుభ్రతలో, వందశాతం ఇంకుడు గుంతలు నిర్మించుకున్న గ్రామంగా ఆరుగుంటపల్లి నిలిచింది. –న్యూస్‌టుడే, వాజేడు





రాణా మెట్లెక్కని.. మెట్లతిమ్మాపురం

పది దశాబ్దాల చరిత్ర గల ఆదివాసీగూడెం.. సత్యం.. ధర్మం అనే గాంధీజీ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ఊరిలో ఎవరి మధ్యనైనా గొడవ.. ఘర్షణ జరిగితే పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఠాణా మెట్లెక్కలేదు. ఎలాంటి సమస్యలు వచ్చినా గ్రామంలోని పెద్దలు చర్చించి సామరస్యంగా పరిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలోని అడవి మధ్యన ఉన్న **మెట్లతిమ్మాపురం** ప్రత్యేకత ఇది.. 130 కుటుంబాలు, 750 మంది జనాభా 412 మంది ఓట్లు కలిగిన ఈ గూడెం ప్రజల్లో కల్మషం, విద్వేషాలు ఏమాత్రం కనిపించవు. కలిసిమెలిసి జీవనం కొనసాగిస్తున్నారు. 'సమస్య పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. గ్రామ పెద్దల మధ్యనైనా ఎక్కడైనా జరిగేది న్యాయమే. అందుకే గ్రామ పరువును కాపాడుకునేందుకు స్టేషన్‌కు వెళ్లకుండా ఇరువర్గాల వారు తీర్పును మెచ్చేలా పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకుంటున్నాం. ఇది మా పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తాం అని ఊరి దొర బిజ్జ నర్సింహారావు, పటేల్ తాటి కృష్ణ వివరించారు.

● వ్యవసాయం పైనే ఆధారపడిన వీరు ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తారు. వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకున్నారు. మురుగునీరు వీధుల్లో పారకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను నిర్మించుకుని స్వచ్ఛతలో శెభాష్ అనిపించుకుంటున్నారు.

● గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులున్నా ఎక్కడా ఏ పార్టీ జెండాలు, స్థూపాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు కనిపించవు. సుమారు 15 ఏళ్ల నుంచి మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారు. అమ్మకాలు చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తున్నారు.

అన్నింట్లో ఆదర్శం

గూడెం ప్రజలు వేలిముద్రలు వేయకూడదనే ఉద్దేశంతో సుమారు 32 ఏళ్ల కిందటనే అప్పటి పెద్ద రామయ్య కనీసం వారందరూ పేర్లు రాసేలా.. బస్సుల పేర్లు తెలిసేలా అక్షరాలు నేర్పించారు. ఆ తర్వాత అక్షరదీపం కార్యక్రమం కింద రాత్రిబడిలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకొని 2005లో నాటి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రశంసలు పొందారు.

● గ్రామస్థుల కోసం అభయ, 100 స్మైల్ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినా కొత్తపుస్తకాలు ఇచ్చే వారు లేరు.

● డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివినవారు 45 మంది వరకు ఉన్నారు. టీచర్లు 13 మంది ఉన్నా ఇందులో పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలున్నారు. పోలీస్, అటవీ శాఖ ఉద్యోగులు నలుగురున్నారు. ఇందులో ఒకరు మహిళా రిజర్వుడు ఎస్ఐ ఉన్నారు.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం

ఆ రెండు గ్రామాల్లో సంపూర్ణ మద్యనిషేధం


గంగదేవిపల్లి

గీసుకొండ: సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేస్తూ ఆ రెండు గ్రామాలు గాంధీజీ కలలను నిజం చేశాయి. అవే వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, మరియపురం గ్రామాలు. గంగదేవిపల్లి ఇరవై ఏళ్ల క్రితమే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా ఎంపికవగా మరియపురం మూడేళ్ల కిందట ఆ స్థానం సంపాదించింది. గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూసం రాజమౌళి నేతృత్వంలో 40 ఏళ్ల కిందటే ఇక్కడి ప్రజలు సారాపై ఉద్యమించి విజయం సాధించారు.


మరియపురం

● గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం వల్లే జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఈ గ్రామానికి మరియపురం ఆనుకునే ఉంటుంది. గంగదేవిపల్లి ప్రభావం ఈ గ్రామం మీద కనిపిస్తుంది. నిర్మల బుక్ బైండింగ్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లం బాలిరెడ్డి 2019లో ఏకగ్రీవ సర్పంచిగా ఎన్నికైన తర్వాత గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు కదిలారు. సారాతోపాటు మద్యం గొలుసు దుకాణాలను అరికట్టి సంపూర్ణ మద్యనిషేధ గ్రామంగా తీర్చిదిద్దారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నిధులను సద్వినియోగం చేసుకుని బాలిరెడ్డి లక్షలాది రుపాయలు సొంత నిధులను వెచ్చించి కేవలం ఐదేళ్లలోనే జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా నిలిపారు.

కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి చర్యలు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి జిల్లాలోని ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ కార్డుల జారీకి అసెంబ్లీ నియోజకవర్గంలో కేటాయించిన బృందాలకు అవసరమైన అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజూ ఇళ్ల లక్ష్యాలను కేటాయించి ఉదయం, సాయంత్రం బృందాల పనితీరు పర్యవేక్షించాలని చెప్పారు. ఇంటింటికి తిరిగి ఆఫ్‌లైన్‌లో పూర్తి వివరాలను సేకరించి సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

59 శాతమే బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఏరియాలో భూగర్భ గనులతో పాటు రెండు ఉపరితల గనుల్లో గత సెప్టెంబరులో 59 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగిందని స్థానిక సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్, అధికార ప్రతినిధి కె.మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన నెలలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.59 లక్షల టన్నులకు 2.11 లక్షల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి సాధించారు. రోజువారీగా ఉత్పత్తి 7034 టన్నుల వరకు జరుగుతోందని, రవాణా 62 శాతం జరిగిందని పేర్కొన్నారు. అక్టోబరులో కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్లు సమష్టిగా కృషిచేయాలని, కార్మికులు గైర్హాజరు శాతాన్ని తగ్గించాలని సూచించారు. కారుణ్య నియామకాల్లో 17 మందికి గత నెలలో ఉద్యోగాలు కల్పించటం జరిగిందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున లాభాల వాటా చెల్లించనున్నట్లు తెలిపారు. ఇటీవల ఒడిశా రాష్ట్రంలో జరిగిన బాడిబిల్డింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్ కోల్ ఇండియా పోటీల్లో భూపాలపల్లి ఏరియా క్రీడాకారులు రెండు బంగారు పతకాలు, మూడు సిల్వర్, ఒక రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు.

బస్ షెల్టర్ల నిర్మాణం ఎప్పుడో..?

ప్రయాణికుల సౌకర్యార్థం మహాముత్తారం మండలంలో నాలుగు చోట్ల న్యూ మోడల్ బస్‌షెల్టర్ల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2023 ఆగస్టులో నిధులు మంజూరు కాగా, ఇప్పటివరకు ఒక్క నిర్మాణమూ జరగలేదు. రూ.5లక్షలతో మహాముత్తారంలో, కాటారం-మేడారం ప్రధాన రహదారిపై యామన్‌పల్లి, బోర్లగూడెం, సింగారం వద్ద ఒక్కో బస్ షెల్టర్ రూ.3 లక్షలతో పూర్తి చేయాల్సి ఉంది. 2022లోను సీడీపీ నిధుల ద్వారా కొర్లకుంట, నిమ్మగూడెం, కనుకునూర్, పెగడపల్లి వద్ద ఒక్కో బస్ షెల్టర్‌కు రూ.2 లక్షల చొప్పున మంజూరయ్యాయి. గుత్తేదారులు పనులు ప్రారంభించలేదు. నిధులు వెనక్కి వెళ్లకముందే పనులు ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మహాముత్తారం(భూపాలపల్లి జిల్లా)

నిరంతర ప్రక్రియగా స్వచ్ఛత-పచ్చదనం

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే : స్వచ్ఛత-పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. చెల్పూర్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం, పరిశుభ్రమైన వాతావరణం సృష్టించడమే స్వచ్ఛతా హీ సేవా ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని.. ప్రతి కుటుంబం తప్పని సరిగా మరుగుదొడ్డి వినియోగించాలన్నారు. ఆరుబయట మల విసర్జన చేస్తే పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయని.. అంటువ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. విద్యార్థులు తమ కుటుంబసభ్యులు పరిశుభ్రత పాటించేలా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, డీఆర్డీవో అవినాశ్, ఎంపీడీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


చిరుధాన్యాల ఆహారం రుచి చూస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

● చెల్పూర్‌లో మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ సందర్శించారు. యూనిట్‌లోని యంత్రాలను పరిశీలించి చిరు ధాన్యాలతో చేసిన ఆహారాల రుచి చూశారు. యూనిట్ పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిల్లెట్లకు మంచి డిమాండ్ ఉందని, మిల్లెట్ ద్వారా చేసిన తినుబండారాలను మార్కెట్‌లో విక్రయించవచ్చని తెలిపారు. ప్రభుత్వ వసతిగృహాలు, మహిళా శక్తి క్యాంటీన్లకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని.. ఎలాంటి మానసిక ఆందోళనకు గురికాకుండా ఉంటే.. నేరాలు చేయాలనే ఆలోచన రాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా ఛైర్మన్ పి.నారాయణబాబు అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కోర్టు నుంచి స్థానిక అంబేడ్కర్ కూడలి వరకు న్యాయ అవగాహన ర్యాలీ కొనసాగించారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కోర్టుల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా చేసుకోవడం జరిగిందని, ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని న్యాయమూర్తి నారాయణబాబు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాంచంద్రారావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి మహేందర్, పీపీ ఎ.శ్రీనివాస్, కోర్టు సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


భూపాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కోర్టు సిబ్బంది, విద్యార్థులు

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కాటారం, మహదేవపూర్ న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాటారం డివిజన్‌లో బుధవారం పర్యటించనున్నారు. కాటారం-భూపాలపల్లి జాతీయ రహదారి మార్గంలో, మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. కాటారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు.

పండగ వేళ.. ప్రయాణం భారం!

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆడపడుచులు వారి తల్లిగారింటికి బయలుదేరుతారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో పిల్లలతో ఎంత కష్టమైనా సొంతింటికి వెళతారు. ఓరుగల్లు ప్రజలు ఎక్కువగారైళ్లలో ప్రయాణిస్తారు. ఈసారి పండగకు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మూడోలైను పనుల కారణంగా వరంగల్, కాజీపేట నుంచి వెళ్లే రైళ్లను ఈ నెల 7 వరకు రద్దు చేశారు. ప్రత్యేక రైళ్లను ప్రకటించినా వాటిలో చాలా వరకు రద్దయ్యాయి. దీంతో అందరూ బస్సులనే ఆశ్రయించాల్సి వస్తోంది. బతుకమ్మ, దసరా పండగకు వరంగల్ ఆర్టీసీ అదనపు బస్సులను మంగళవారం నుంచి నడిపిస్తోంది. రైలు ప్రయాణికులంతా వాటినే ఆశ్రయిస్తారు కాబట్టి రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కొందరు సొంత వాహనాల్లో పయనం కావడానికి సిద్ధమవుతున్నారు. చౌకగా ప్రయాణం చేసే రైళ్లు రద్దు కావడం అందరికీ భారంగా మారింది..

–కాజీపేట, హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

రైళ్ల రద్దు.. బస్సుల్లో రద్దీ


రైళ్లు రద్దు కావడంతో వెల వెల పోతున్న కాజీపేట రైల్వే స్టేషన్

బస్సు	ఛార్జీల వివరాలు (రూ.)	రైలు
300	వరంగల్-హైదరాబాదుకు	80
275	వరంగల్-ఖమ్మం	75
250	వరంగల్-రామగుండం	70


ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్



అదనపు భారం రూ.2 వేలు

రైళ్లు లేకపోవడంతో ఈసారి బస్సు ప్రయాణం తప్పదు. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నా రద్దీని తట్టుకోవడం కష్టం. దీంతో ఛార్జీలు అధికంగా ఉండే డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఉన్నత స్థాయి బస్సులను ఆశ్రయించాల్సిందే. వాటిలోనూ సీట్లు దొరకడం కష్టం.

ఇదీ పరిస్థితి: ఇంట్లో నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణం చేయాలనుకుంటే రైలు ఛార్జీతో పోలిస్తే ఒక్కొక్కరికి బస్సులో రూ.200 నుంచి రూ.225 వరకు ఎక్కువ అవుతుంది. దీనికి తోడు ఆటోలు, ఇతర రవాణా ఛార్జీలు కలుపుకొని కుటుంబానికి రానుపోను రూ.2000 వరకు అదనపు భారం పడుతుంది.

గతేడాది అక్టోబరులో దసరా, బతుకమ్మ పండగ నేపథ్యంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణించినవారి సంఖ్య (రోజుకు సగటున)

● మార్గం	● ప్రయాణికుల సంఖ్య	● సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య	● తేడా
వరంగల్-కాజీపేట- సికింద్రాబాద్	16,000	9,500	6,500
కాజీపేట-వరంగల్- ఖమ్మం	13,000	8,500	4,500
కాజీపేట - వరంగల్- బల్లార్ష	15,000	6,500	7,500

బల్లార్ష మార్గంలో బహుకష్టం

బల్లార్ష మార్గంలో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గమే సులువు.. చౌకగా వెళ్లొచ్చు. రైళ్లు రద్దు చేయడంతో కరీంనగర్ మీదుగా బస్సులో వ్యయప్రయాసలతో ప్రయాణించాల్సిందే.

నిండిన బెర్తులు: దసరా పండగకు కోల్‌కతా, ఒడిశా, బెంగళూరు, మైసూరు, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువగా వెళుతుంటారు. ఈమార్గంలో రైళ్లకు చాంతాండంత వెయిటింగ్ లిస్టు ఉంది. హౌరా, యశ్వంతాపూర్, పద్మావతి రైళ్లల్లో బెర్తులు లేవని చూపిస్తున్నాయి.

ప్రైవేటు వాహనాలకు గిరాకీ



ప్రైవేటు వాహనాలకు గిరాకీ బాగా పెరిగింది. ఇప్పటికే వరంగల్‌లోని ట్రావెల్స్‌ల్లో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు బతుకమ్మకు ముందు రోజున బుక్ అయ్యాయి. డిమాండ్ పెరగడంతో ఆ రోజు ప్రయాణానికి అదనంగా వసూలు చేయనున్నారు.

ముందస్తు ప్రయాణం మేలు

పండగకు ముందురోజు కంటే ఒకటి, రెండు రోజుల ముందే ప్రయాణం కడితే కొంత రద్దీని తట్టుకోవచ్చు. చాలా మంది సాయంత్రం విధులు ముగించాక బయలుదేరుతారు. కాస్త ముందుగా బయలుదేరితే ఆర్టీసీకి కాస్త వెసులుబాటు లభిస్తుంది.

● ఇప్పుడు చాలా మందికి కార్లు ఉంటున్నాయి. కాబట్టి కాస్త ఖర్చు ఎక్కువైనా కారు లేదా ఇతర వాహనాలు వాడితే సామాన్య ప్రజలకు బస్సుల్లో కాస్త వెసులుబాటు ఉంటుంది.

ట్రిప్పుల సంఖ్య పెంచాలి..

-మాడిశెట్టి చంద్రశేఖర్, హనుమకొండ



గతంలో రైళ్లలో ప్రయాణించేవాళ్లం.. ఈసారి అవి రద్దయ్యాయి. దీనితో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంది. రైళ్లు నడిచే మార్గంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడిపించాలి. ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలి.

అదనపు భారం

-గద్దల సతీష్, ప్రయాణికుడు



మా స్వగ్రామం మంచిర్యాల దేవనూరు. మా బంధువులు అంతా అక్కడే ఉంటారు. మేము హనుమకొండకు వచ్చి దాదాపు 15 ఏళ్లు అవుతోంది. అప్పుడప్పుడు మా గ్రామానికి వెళ్లి వస్తుంటాం. ఈ ఏడాది దసరాకు వెళ్దామని అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇంతలోనే రైళ్లు రద్దు అని చెబుతున్నారు. బస్సులో వెళ్తే ప్రయాణ భారంతో పాటు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. ఈ సమయంలో రైళ్లు రద్దు చేయడం సరికాదు.. పండగలు ముగిసిన తర్వాత ఆ నిర్ణయం తీసుకుంటే బాగుండేది

నేటి నుంచి 850 అదనపు బస్సులు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: వరంగల్ రీజియన్‌లో 850 బస్సులను (ట్రిప్పులు) నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు తిరుగుతాయి. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఇవి నడుస్తాయి. పండగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు సైతం బస్సులు నడపనున్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో గతేడాది కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

● హనుమకొండ బస్టాండు నుంచి హైదరాబాద్ రూట్లో నిత్యం 250 బస్సులు నడుస్తుంటాయి..దాదాపు 400 ట్రిప్పులు. పండగ సందర్భంగా అదనంగా 150 బస్సులు నడిపిస్తారు.. ● ఖమ్మం, మహబూబాబాద్ రూట్లలో వరంగల్ రీజియన్ నుంచి హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నడుస్తాయి. 25 బస్సులు ఖమ్మం వరకు ఉంటాయి. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు మరికొన్ని బస్సులు నిత్యం నడుస్తాయి. ఈ మార్గంలో అదనంగా మరో 50 బస్సులను పెంచనున్నారు.

డిపోల వారీగా నడిపే ప్రత్యేక బస్సులు

వరంగల్-1	125
వరంగల్-2	125
హనుమకొండ	125
పరకాల	93
నర్సంపేట	119
జనగామ	120
తొర్రూరు	48
మహబూబాబాద్	47
భూపాలపల్లి	48

రేపటి నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు

● 10న సద్దుల బతుకమ్మ.. 12న దసరా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణ అధికారిణి శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు వెల్లడించారు. 10న మహానవి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం, సద్దుల బతుకమ్మ, 12న విజయదశమి(దసరా) ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తారని, ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులకు వాహన సేవలుంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, చింత శ్యాంసుందర్, అర్చకుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

రోజు వారీగా కార్యక్రమాలు..

● 2న ఉదయం హరిద్రాదర్శనం శరన్నవరాత్రయాగ పూర్వాంగనిధి, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ
● 3న భేరి పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, అమ్మవారిని శైలపుత్రిక్రమము బాలా త్రిపురసుందరి అలంకరణ, ఉదయం 11 గంటలకు వృషభ వాహనసేవ, సాయంత్రం మృగ(జింక) వాహనసేవ
● 4న అన్నపూర్ణాలంకారం, బ్రహ్మచారిణి దుర్గార్చన, మకర, చంద్రప్రభ వాహనసేవలు
● 5న గాయత్రి అలంకరణ, చంద్రఘంటా దుర్గార్చన, సింహ, గజ వాహనసేవలు
● 6న శ్రీమహాలక్ష్మి అలంకరణ, కూష్మాండీ దుర్గార్చన, సూర్యప్రభ, హంస వాహనసేవలు
● 7న లలితా పంచమి శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరి, స్కందామాత దుర్గార్చన, పల్లకీ సేవ, శేషవాహనసేవ
● 8న భవాని అలంకరణ, కాత్యాయని దుర్గార్చన, గంధోత్సవం, చండముండ దుర్గార్చన, సాలభంజిక సేవ
● 9న శ్రీ సరస్వతీమాత, కాళరాత్రి దుర్గార్చన, రాత్రి అమ్మవారికి రథోత్సవం
● 10న మహాష్టమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, మహా దుర్గా అలంకారం, మహా గౌరి దుర్గార్చన, భద్రపీఠ సేవ, అశ్వవాహన సేవ, సద్దుల బతుకమ్మ
● 11న మహా నవమి మహిషమర్ధిని అలంకరణ, శుంభ దుర్గార్చన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం సర్వభూపాల వాహనసేవ
● 12న విజయ దశమి, శమీ పూజ, శ్రీభద్రకాళి అమ్మవారికి మహా పట్టాభిషేకం, నిజరూప దర్శనం, రాత్రి భద్రకాళి చెరువు(తటాకంలో)లో శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు తెప్పోత్సవం
● 13న సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం.

రూపుదిద్దుకుంటున్న కాజీపేట వంతెన

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

● రాయ్‌పూర్‌లో సిద్ధమవుతున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

కాజీపేట వద్ద నిర్మాణంలో ఉన్న రెండో ఆర్వోబీపై బిగించేందుకు ఉక్కుతో తయారు చేస్తున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో సిద్ధమవుతోంది. నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెలాఖరుకు విడిభాగాలు ఇక్కడకు తీసుకొస్తారు. విల్లు ఆకారంలో ఉక్కుతో ఉన్న ఈ భాగాన్ని రైల్వే పట్టాలపై నిపుణులు బిగించనున్నారు. రాష్ట్రంలో ఇలాంటి తరహా వంతెన ఇప్పటి వరకు ఎక్కడా లేదని.. కాజీపేటపై రెండో ఆర్వోబీపై వచ్చేది మొదటిది అని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

- ● శంకుస్థాపన - 2017
- ● టెండర్లు పిలిచింది - 2019
- ● పూర్తి కావాల్సింది - 2020
- ● పనులు ప్రారంభమైంది - 2021
- ● మొత్తం అంచనా వ్యయం - రూ.45 కోట్లు
- ● 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగం నిర్మాణానికి - రూ.20 కోట్లు
- ● వెడల్పు - 9.5 మీటర్లు
- ● ఎడమవైపు పాదచారుల దారి - 1.5 మీటర్లు.


తయారీ దశలో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

మరో రూ.16 కోట్లు విడుదల చేయాలి

ఈ వంతెనను వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అనే గుత్తేదారు సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థకు ప్రభుత్వం ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా నిధులు ఇంకా గుత్తేదారుకు అందలేదని, అందుకే వంతెన నిర్మాణం నిలిచిపోయినట్టు సమాచారం. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులను వెంటనే విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి.

విల్లు ఆకారమే ప్రత్యేకం

కాజీపేటలో ఉన్న పాత ఆర్వోబీకి కొత్త వంతెన పూర్తి భిన్నంగా ఉంటుంది. దీన్ని 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' గా పిలుస్తారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు ఏమాత్రం అంతరాయం లేకుండా వంతెన నిర్మాణాన్ని కొనసాగించేందుకు ముందే సిద్ధం చేసిన 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'ను వంతెనపై బిగించనున్నారు. వంతెనను 21 స్తంభాలతో నిర్మిస్తుండగా, ఇందులో రైల్వే లైన్ల పైభాగంలో మాత్రం విల్లు ఆకారంలో ఉండే నిర్మాణం మొత్తం ఉక్కు మిశ్రమంతో ఉంటుంది. దీనికి ఆధారంగా మూడు పిల్లర్లు ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. రైల్వే పట్టాలపై 800 టన్నుల బరువుతో 250 అడుగుల పొడవుతో రెండు భాగాలు ఉంటాయి. అంటే మొత్తం 1600 టన్నుల బరువు, 500 అడుగుల పొడవుతో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగాలను రాయ్‌పూర్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే మన ఇంజినీర్లు అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించారు. 'ఈనాడు' ఆ చిత్రాలను ప్రత్యేకంగా సంపాదించింది. ప్రస్తుతం ఉన్న వంతెన కన్నా కొత్త వంతెన ఎక్కువ ఎత్తుతో ఉండనుంది.



కేయూలో విజిలెన్స్ విచారణ


కేయూ అధికారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యానగర్,న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి టి.రమేష్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఎ.బాలకోటి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌లు జి.రాకేష్, బి.అనిల్, హన్నన్, ఎఫ్ఆర్ఓ గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు కేయూకు వచ్చారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పరీక్షల నియంత్రణ అధికారులను విచారించారు. ప్రొఫెసర్లను సీనియర్ ప్రొఫెసర్లుగా ఏ విధంగా పదోన్నతి కల్పించారు.. సెలక్షన్ కమిటీ ఆమోద పత్రాలు, ఈసీ మినిట్స్, 2022లో పీహెచ్‌డీ ప్రవేశాలు ఎలా భర్తీ చేశారు.. తదితర అంశాలపై విచారించి, వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన వివిధ పత్రాలు సమర్పించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రెండు మూడు సార్లు నోటీసులు పంపించినా వాటికి ఎలాంటి సమాధానాలు రాక పోవడంతోనే నేరుగా విచారణకు వచ్చినట్లు సమాచారం.

భారీ బతుకమ్మకు అంతర్జాతీయ రికార్డు


జనగామలోని నెహ్రూపార్కు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో 36.2 అడుగుల భారీ బతుకమ్మ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 36.2 అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రపంచంలోకెల్లా అతిపెద్ద బతుకమ్మగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. స్టీల్, వైబ్రెంట్ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌తో 700 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు కలిసి 24 గంటలలోపు దీన్ని తయారు చేశారు. ఇంతకు ముందు ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును అధిగమించినందున ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు నరేందర్‌గౌడ్, సుభాషిని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసాని శ్రీధర్‌కు సదరు రికార్డు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణపత్రం

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

నఖ చిత్ర కళలో దిట్ట



దళసరి కాగితాలే క్యాన్వాస్‌గా వేలి గోర్లే కుంచెగా చేసుకుని అద్భుత కళాఖండాలు చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు నర్సంపేటకు చెందిన కళాకారుడు మండ వీరస్వామి. కవి, గేయరచయిత, గాయకుడు, చిత్రకారుడు, రంగస్థల నటుడిగానే గాక చిత్రలేఖనంలో చేయి తిరిగిన చిత్రకారుడు కూడా. చిత్రలేఖనంలో పట్టున్న ఆయన దళసరి కాగితాలపై నఖ(గోటి)తో మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు తదితరుల చిత్రాలు గీసి అబ్బురపరుస్తున్నారు. –న్యూస్‌టుడే, నర్సంపేట

5న ఉద్యోగ మేళా

కొత్తవాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న వరంగల్ ములుగురోడ్డులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చెన్నైలోని హిందూస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్‌లో 100 ఉద్యోగ ఖాళీలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. ఇంటర్‌లో 75శాతం మార్కులు వచ్చి, 18 నుంచి 22 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 75691 77071 సంప్రదించాలన్నారు.

చారిత్రక ప్రాంతాల సందర్శనే లక్ష్యం


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ జీఎం కిషోర్, ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్ తదితరులు

కాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శింపజేయడమే లక్ష్యంగా ఐఆర్‌సీటీసీ పని చేస్తుందని సంస్థ జనరల్ మేనేజర్ కిషోర్, టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక పర్యాటక రైలుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. స్థానిక టూరిజం ఏజెంట్లకు దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత్ గౌరవ్ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుందని చెప్పారు. నవంబరు 6న సికింద్రాబాద్ నుంచి ఈ రైలు ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ యాత్రలో రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర సందర్శన ప్రదేశాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రయాణికులు వివరాలకు 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


సంఘమిత్ర కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు


గణపురం ప్రోగ్రెస్ పాఠశాలలో..


చెల్పూర్ ఎంజేపీ పాఠశాలలో..


కాటారంలో..

పూల పండగ.. ఆనందాలు నిండుగా!

తీరొక్క పూలతో బతుకమ్మలు తయారు చేసి.. విద్యార్థినులు కోలాటాలు, ఉయ్యాల పాటలతో సందడి చేశారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరూ పండగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, బృందం


చిట్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో..


మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో


మల్హర్ : పెద్దతూండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో..


కాళేశ్వరం : పాఠశాల ఆవరణలో

విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి


రంజిత్‌కుమార్(పాతచిత్రం)

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి శివారు చల్లూరిపల్లి గ్రామానికి చెందిన చల్లూరి రంజిత్‌కుమార్(30) అనే లారీ డ్రైవర్ ప్రమాదవశాత్తు ఇంట్లో విద్యుత్తు మోటారును ఆన్‌చేస్తున్న క్రమంలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మోటారుకు విద్యుత్తు సరఫరా కావడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని లారీ డ్రైవర్లు, ఓనర్లు పరామర్శించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

భూపాలపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోని ఆజంనగర్ రోడ్డు మార్గంలో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో మహాముత్తారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఐరెడ్డి శ్రావణ్‌రెడ్డి(34) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం శ్రావణ్‌రెడ్డి ద్విచక్రవాహనంపై వచ్చారు. కొత్త దుస్తులు కొనుగోలు చేసుకున్న తర్వాత తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలోనే కమలాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో అతివేగంగా వెళ్తూ వాహనం అదుపుతప్పడంతో చెట్టుకు ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీజేవైఎం స్వచ్ఛభారత్



భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. సుభాష్‌కాలనీ ప్రాంతంలోని గాంధీ విగ్రహం సమీపంలో ఎలాంటి చెత్త చెదారం లేకుండా, రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు లేకుండా తొలగించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలీబ్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. నాయకులు బట్టు రవి, డి.రాజేందర్, రామిరెడ్డి, భాస్కర్, నారాయణ, రమేష్, తిరుపతి, శివరాజ్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే దళితుల బలోపేతం


నినాదాలు చేస్తున్న మాలల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ శివకుమార్, శ్రేణులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: ఐక్యంగా ఉంటేనే దళితులు అన్నిరంగాల్లో బలోపేతం చెందుతారని మాలల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ గంపల శివకుమార్ అన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలో మంగళవారం సాధనపల్లి చిట్టిబాబు అధ్యక్షతన ఐక్య వేదిక సమావేశం జరిగింది. ఎస్సీల వర్గీకరణ చేయాలనే ఆలోచన రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ ప్రక్రియపై సుప్రీం కోర్టు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణకు తెరలేపారని, క్రిమిలేయర్ ముసుగులో రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను పెంచాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, అసైన్మెంట్ భూములను ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేయాలన్నారు. ప్రత్యేక కార్యాచరణతో వెనకబడిన ఎస్సీల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. మాలలను చైతన్యవంతం చేసేందుకు ఈ నెల 25 నుంచి గ్రామస్థాయిలో పాదయాత్రలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. అనంతరం నూతన అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కో కన్వీనర్‌గా సాధనపల్లి చిట్టిబాబు, అధ్యక్షుడిగా మంచాల భూషణం, కార్యదర్శిగా భరత్‌కళ్యాణ్, సభ్యులుగా లకుమల్ల మోహన్‌రావు, సంగం విద్యాసాగర్, నంది వెంకటేశ్వర్లును నియమించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ గోగులమూడి హరికృష్ణ, నాయకులు సుందర్‌రావు, ఎండీ కృష్టియన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీపీలో నిలిచిన విద్యుదుత్పత్తి

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే : గణపురం మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్(కేటీపీపీ)లో మంగళవారం విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. 500 మెగావాట్ల మొదటి దశ ఉత్పత్తి కేంద్రంలోని బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా ఉత్పత్తి నిలిచిపోయినట్లు తెలిసింది. లీకేజీ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

స్థానిక సంస్థల్లో భాజపా గెలుపే ధ్యేయం


సభ్యత్వ నమోదులో పాల్గొన్న మొగిలి

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక మెజారిటీతో అభ్యర్థులను గెలిపించుకొని భాజపా జెండా ఎగురవేయాలని భాజపా చాంద్రాయణగుట్ట ప్రభారి, జిల్లా సభ్యత్వ కన్వీనర్ జన్నె మొగిలి అన్నారు. మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, మండల సభ్యత్వ ప్రభారి చదువు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు వేముల రాజయ్య, పోతుగంటి సాయిలు, దొంగల రాజయ్య పాల్గొన్నారు.

చిట్యాల : భాజపా శ్రేణులంతా కలిసికట్టుగా కష్టపడి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ జన్నె మొగిలి తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.. కార్యక్రమంలో గజనాల రవీందర్, మైదం శ్రీకాంత్, కెంసారపు ప్రభాకర్, చింతల రాజేందర్, చెన్నవేణ సంపత్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న భాజపా


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భాజపా మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, పేద, మధ్యతరగతి ప్రజలకు తీరని నష్టం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్‌కాలనీలో మంగళవారం సీపీఎం పట్టణ ప్రథమ మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశ అభివృద్ధికి పాటుపడకుండా కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, ఆదివాసులు, కార్మికులు, పేదలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజలు భాజపా విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు వి.రాజయ్య, రమేష్, శేఖర్, మహేందర్, నరేష్, భిక్షపతి, రవికుమార్, రజాక్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, పీడీ గుండెల్లి రాజయ్య మంగళవారం తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కురిక్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ క్రీడా పోటీల్లో విద్యార్థులు శివాజీ, వినయ్ ప్రతిభ కనబర్చారని చెప్పారు. నవంబర్ 2న బీహార్‌లోని జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరుపున పాల్గొంటారని వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

గణపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గణపురం ఎస్సై ఆర్. అశోక్ తెలిపారు. మంగళవారం గణపురం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, మత్తు పదార్థాలతో కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని.. వాటి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆపద సమయంలో 100 డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐకేఎం జిల్లా కన్వీనర్‌గా రమణారెడ్డి

టేకుమట్ల, న్యూస్‌టుడే : ఏఐకేఎం జిల్లా కన్వీనర్‌గా టేకుమట్లకు చెందిన పులి రమణారెడ్డిని మంగళవారం నియమించినట్లు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సమస్యలపై పోరాటం చేస్తున్నందుకు గుర్తించి నియమించినట్లు పేర్కొన్నారు.

సీపీఎం నూతన కమిటీ ఎన్నిక

పలిమెల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం ప్రథమ మహాసభలు నిర్వహించారు. సభల్లో పార్టీ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ మండల కార్యదర్శిగా సూదుల శంకర్, సోషల్ మీడియా బాధ్యులుగా పెద్ది శేఖర్, కమిటీ సభ్యులుగా పాగే పొట్టయ్య, అనపర్తి బాలక్క, దుమ్మడి భీమయ్య, మూసాకి బిలంద్ ఎన్నికయ్యారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్

భూపాలపల్లి రూరల్ : జిల్లా కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు స్వహస్తాలతో వివిధ రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి స్వామి మాట్లాడుతూ ఆహారాన్ని వృథా చేయరాదని సూచించారు. కరస్పాండెంట్ కరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరాంపల్లిలో చికెన్ సెంటర్ ధ్వంసం

కాటారం, న్యూస్‌టుడే : దేవరాంపల్లి బస్టాండు సమీపంలోని చికెన్ సెంటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. దుకాణంలోని వస్తువులు, సామగ్రి దెబ్బతిని నష్టం వాటిల్లింది. సదరు చికెన్ సెంటర్ యజమాని పలువురికి ఇవ్వాల్సిన చిట్టీ డబ్బులు ఇవ్వకపోవడంతోనే ధ్వంసం చేసినట్లు సమాచారం.

3న వయోవృద్ధుల వేడుకలు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 3న కలెక్టరేట్‌లో నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి జిల్లాలోని వయోవృద్ధులు, జిల్లా అధికారులు హాజరు కావాలని కోరారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు నూతన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ మూడు దశల్లో ఉంటుదని చెప్పారు. పూర్తి వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని సీఎంను కోరతాం..


ములుగులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐకాస వ్యవస్థాపకుడు పిడమర్తి రవి

ములుగు, న్యూస్‌టుడే: మాదిగ ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్ర మంగళవారం ములుగు పట్టణానికి చేరుకుంది. ఐకాస వ్యవస్థాపకుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రకు ములుగులో మాదిగలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. జిల్లాలను యూనిట్‌గా తీసుకొని జనాభా ఎంత ఉంటే అంత వాటా దక్కాలన్నారు. 12 శాతం రిజర్వేషన్ అనేది ప్రతి పల్లెను తాకిందని, త్వరలోనే సీఎంను కలిసి ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరనున్నట్లు తెలిపారు. తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలు ఎంతో వెనుకబడి ఉన్నారని, రిజర్వేషన్ అమలుకు కలిసి వచ్చే సంఘాలతో భవిష్యత్తులో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ముదిరాజ్, యాదవ, ముస్లింలకు ప్రాధాన్యం అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కోడారి ధీరజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీది గోవిందరావు, టీఎండీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల మల్లికార్జున్, ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మైస ఉపేందర్, మాదిగ యూత్ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, నాయకులు మహేష్, రమేష్, శీను, నవీన్, ప్రదీప్, అంజి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి ముచ్చట్లు

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు నిర్వహించే వివిధ వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు అనిత మంగళవారం ప్రారంభించారు. సింగరేణి ఆర్జీ-1 సేవా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టైలరింగ్‌తోపాటు మగ్గంవర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు సంబంధించిన తరగతులను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. మార్కెట్‌లో ఉన్న అవకాశాలకు అనుగుణంగా కోర్సులను ఏర్పాటుచేశామని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమితి కోఆర్డినేటర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి

గోదావరిఖని, న్యూస్‌టుడే: నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. స్థానిక జీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబరులో ఆర్జీ-1 ప్రాంతంలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. గత ఆరు నెలల్లో 86 శాతం బొగ్గు ఉత్పత్తి చేపట్టామన్నారు. జీడీకే-11 గనిలోని రెండు కంటిన్యూస్‌మైనర్ యంత్రాల ద్వారా 75 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయని.. జీడీకే-1, 2, 2-ఏ గనుల్లో అతి తక్కువగా బొగ్గు ఉత్పత్తి జరిగిందన్నారు.

చర్చలు సఫలం.. స్థానికులకే ఉద్యోగాలు

గోదావరిఖని: ఓసీపీ-5 ఓబీ కంపెనీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్ మేరకు మంగళవారం జరిగిన చర్చలు ఫలించాయి. పీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులతో జీఎం లలిత్‌కుమార్ సమక్షంలో చర్చలు జరిగాయి. ఈ మేరకు పీసీ పటేల్ కంపెనీ అధికారులు అంగీకారానికి రావడంతో తిరిగి పనులు ప్రారంభించారు.

లాభాల వాటాపై తప్పుడు ప్రచారం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): లాభాల వాటాపై కొన్ని కార్మిక సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఏఐటీయూసీ సీనియర్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీరావు, సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్ ఆరోపించారు. మంగళవారం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో పిట్ సెక్రెటరీ గంగాధర్ ఆధ్వర్యంలో ఆర్జీ-3 బ్రాంచి సెక్రెటరీ ఎమ్మార్సీరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ లాభాల్లో 33 శాతం ఇప్పించామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల చొప్పున ఇప్పించిన ఘనత తమదేనన్నారు. సహాయ బ్రాంచ్ సెక్రెటరీ డీటీరావు, సహాయ పిట్ సెక్రెటరీ కుమార్, ఆర్జీ-3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య, నాయకులు కిరణ్‌కుమార్, సలీం పాల్గొన్నారు.

అధికారులపై రాజకీయ ఒత్తిడి

గోదావరిఖని: సింగరేణిలో నిజాయతీ అధికారులపై రాజకీయ ఒత్తిడి పెంచుతున్నారని ఏఐటీయూసీ నాయకులు సీతారామయ్య, రాజ్‌కుమార్ ఆరోపించారు. సింగరేణికి చెందిన ఓ టెండర్ విషయంలో సంతకం చేయనందుకు ఆ పదవీ నుంచి అధికారిని తప్పించారని ఆరోపించారు. గోదావరిఖనిలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో ప్రైవేటు కాంట్రాక్టు విధానం పెరిగిపోతుందని, దీని వల్ల భవిష్యత్తులో సంస్థ నష్టపోయే అవకాశం ఉందన్నారు. నాయకులు వైవి.రావు, సారయ్య, స్వామి, పోశం తదితరులున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గోదావరిఖని: సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో ఆర్జీ-1, 2 డివిజన్ల బాస్కెట్‌బాల్ పోటీలను పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడా నైపుణ్యం పెంపొందించుకుని కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించాలన్నారు. క్రీడా గౌరవ కార్యదర్శి సారంగపాణి, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

● **భూపాలపల్లి :** పట్టణంలోని రాంనగర్‌కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుంది. **- మల్లయ్య, సత్తార్‌నగర్**

● తాగునీటి సరఫరా పర్యవేక్షించే కార్మికులను పంపించి, పైపులైన్ లీకేజీలను సవరించడానికి చర్యలు తీసుకుంటాం. **- దాట్ల శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్**

● **భూపాలపల్లి :** మున్సిపాలిటీ పరిధిలోని నర్సింహారెడ్డిపల్లి గ్రామంలో చేతిపంపు చెడిపోయి వారం గడిచింది. గ్రామంలో ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. **- భుజంగరెడ్డి, నర్సింహారెడ్డిపల్లి**

● తాగునీటి సరఫరా పర్యవేక్షించే సిబ్బందిని పంపించి మరమ్మతు చర్యలు తీసుకుంటాం. **- బి.సమ్మయ్య, వార్డు కౌన్సిలర్**

టేకుమట్ల : మండలంలోని రామకృష్ణాపూర్(టి)లోని రెండు పడకల గదుల ఇళ్ల కాలనీలో ఇప్పటివరకు వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రయితే కాలనీలో అంధకారం నెలకొంటోంది. **-రేకుకుంట్ల ప్రవీణ్, రామకృష్ణాపూర్(టి), టేకుమట్ల**

● వీధి దీపాలను రెండు రోజుల్లో బిగించి సమస్య పరిష్కరిస్తాం. **- మౌనిక, పంచాయతీ కార్యదర్శి, రామకృష్ణాపూర్(టి).**

కాళేశ్వరం : కాళేశ్వరం దేవస్థానం తూర్పు రాజగోపురం ఈశాన్యం మూల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. దేవస్థాన అధికారులు వెంటనే తొలగించాలి. **-భక్తులు**

● సిబ్బందితో వెంటనే శుభ్రం చేస్తాం. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూస్తాం.. **-మారుతి, ఈవో**

● **మహాముత్తారం :** బోర్లగూడెం పంచాయతీ భవనం సమీపంలోని నీటి పైపు పగలడంతో 12 రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. **- కాజీపేట విజయలక్ష్మి,**

- సమస్యను పరిష్కరిస్తాం. **-శిరీష, పంచాయతీ కార్యదర్శి, బోర్లగూడెం**

పైపులైన్‌కు మరమ్మతు

స్పందనకు వందనం

భూపాలపల్లి : పట్టణంలోని హన్మాన్‌నగర్‌లోని ముంజంవాడలో నాలుగు రోజులుగా తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది.. మహిళలు కొందరు 'మేమున్నాం.. మీకు తోడుగా..'కు సమాచారం ఇచ్చారు. విషయాన్ని వార్డు కౌన్సిలర్ చల్ల రేణుక దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించారు. తాగునీటి సరఫరా పర్యవేక్షించే కార్మికులను పంపించి, లీకేజీ అయిన పైపులకు మరమ్మతు చేయడంలో సమస్య పరిష్కారానికి నోచుకుంది.

మురుగుకాలువ శుభ్రం



మొగుళ్లపల్లి : పెద్దకోమటిపల్లిలో మురుగు కాల్వను మంగళవారం పంచాయతీ కార్యదర్శి కేతిరి ఇంద్రసేన శుభ్రం చేయించారు. కాలువలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికుడు సురేష్ 'మేమున్నాం..' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఇంద్రసేనకు వివరించగా స్పందించి మంగళవారం జీపీ సిబ్బందితో కాల్వను శుభ్రం చేయించారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం


వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా వైద్యారోగ్యాధికారి మధుసూదన్

మహాముత్తారం, న్యూస్‌టుడే : అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరిగేలా ఆరోగ్య సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్యారోగ్యాధికారి మధుసూదన్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మహాముత్తారం మండలం ఎంపికైనందున ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం పూర్తి చేయాలని చెప్పారు. మండలంలో డెంగీ, మలేరియా విస్తరించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మహాముత్తారం వైద్యాధికారి సందీప్, డీపీవో చిరంజీవి, డీడీఎం మధుబాబు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోండి


మాట్లాడుతున్న టీజీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

కాటారం, న్యూస్‌టుడే : త్వరలో జరిగే కరీంనగర్-ఆదిలాబాద్-మెదక్-నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులంతా ఓటరు నమోదు చేసుకోవాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ బండారి రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో టీజీఎఫ్ ఏర్పాటు చేసి నాలుగు జిల్లాల్లో 42 నియోజకవర్గాల్లో కోఆర్డినేటర్లను నియమించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు లక్షల ఓటర్ల నమోదు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీజీఎఫ్ మంథని, కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్లు పప్పుల శ్యాంప్రసాద్, సందీప్ ఉన్నారు.